మా కలం.. మీ వజ్రాయుధం..
APTEL 2022 / 16169

# టుడే పల్లె సాక్షి
తెలుగు దిన పత్రిక

pallesakshi2022@gmail.com
youtub : pallesakshi news

PUBLISHED FROM : AMARAVATHI, VIJAYAWADA, HYD, KURNOOL, NANDYALA, KADAPA, ANANTAPUR, CHITOOR, ALL DISTRICTS IN ANDHRA PRADESH & TELANGANA

| కర్నూలు : ఎడిటర్ : వి.లింగమూర్తి | సంపుటి : 5 సంచిక : 81 | పేజీలు : 8 | వెల రూ.4/- | email : pallesakshi2022@gmail.com | మంగళవారం 18-08-2026 |
|---|---|---|---|---|---|



విలేకరులు కావలెను

పెన్ సాక్షి...న్యూస్ ఛానెల్,మరియు టుడే పల్లెసాక్షి తెలుగు దిన పత్రికకు విలేకరులు కావలెను...

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వెలువబడుతున్న జిల్లా (స్టాపర్లు) (బ్యూరోలు) నియోజకవర్గం,మరియు మండల కేంద్రంలో పనిచేయుటకు ఆసక్తి ఉన్న విలేకరులు కావలెను.. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వబడును...

వి. లింగమూర్తి
ఎడిటర్ , కర్నూలు జిల్లా
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
సెల్...9000367833
సెల్...8074937223



## తొలగించిన... ఓట్లు 'క్యూర్'లోనే అధికం

**హైదరాబాద్:** తొలగించిన ఓట్లు క్యూర్ పరిధిలోనే ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కువ ఓట్లు తొలగిపోయాయి. జూన్ 10 నాటికి అంటే సర్ ప్రారంభం కాకముందు ఉన్న జాబితాలోని ఓటర్ల సంఖ్యతో పోల్చితే అత్యధికంగా హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో 45. 17శాతం ఓట్లను కేంద్ర ఎన్నికల సంఘం తొలగించింది. 40 శాతానికిపైగా ఓట్లు తొలగించిన నియోజకవర్గాలు 12 వరకు ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరులో 4.3 శాతం ఓట్లు మాత్రమే తొలగిపోయాయి.

**నిజామాబాద్ అర్బన్‌లో అత్యధిక అనామలీస్ ఓట్లు...** నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిచేసి ఇచ్చినప్పటికీ పొరపాట్లు ఇతర కారణాలతో అనామలీస్ కేటగిరీలో ఎన్నికల సంఘం చేర్చింది. వీరం దరికీ నోటీసులు జారీ కానున్నాయి. అత్యధికంగా అనామలీస్ కేటగిరీ ఓట్లు నిజామాబాద్ అర్బన్ (39.01 శాతం)లో ఉన్నాయి. అత్యల్పంగా ఉన్నవి నల్గొండ జిల్లా మునుగోడులో. మ్యాపింగ్ చేయని ఓటర్లు అత్యధికం కూకట్‌పల్లిలో ఎన్యూమరేషన్ ఫారాల్లో ఓటర్లు తప్పనిసరి 2002 జాబితాలోని ఓటరు నంబరు నమోదు చేయాలి. అప్పటికి ఓటరు జాబితాలో పేరు లేకుంటే

..2వ పేజీలో

# మెగా డీఎస్సీపై బురదచల్లి... పారిపోతున్న వైకాపా..!!

సభకు వస్తే అడ్డంగా దొరికిపోయేవాళ్లు
పత్రాలన్నింటినీ చూపి వారిని ఎండగట్టేవాణ్ని
ఒడిశా నుంచి రోజుకూలీల్ని తెచ్చి,
నకిలీ పోరాటాలు చేస్తున్నారు
అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ధ్వజం
డీఎస్సీలో అక్రమాలు జరగలేదని స్పష్టీకరణ

2 లో



**అమరావతి:** మెగా డీఎస్సీపై హిట్ అండ్ రన్ తరహాలో దుష్ప్రచారం చేస్తున్న వైకాపా నేతలు.. ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సవాల్ విసిరారు. మెగా డీఎస్సీలో ఎక్కడా అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ఉంచామని చెప్పారు. డీఎస్సీ నియామకాలకు సంబంధించిన అంశంపై సోమవారం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడారు. 'వైకాపా నేతలు అసెంబ్లీకి వచ్చి ఉంటే పత్రాలన్నీ ఇచ్చి వాళ్లను ఎండగట్టేవాణ్ని. దెబ్బకు పారిపోయేవారు. సభకు వస్తే అడ్డంగా దొరికిపోతామని భయం. సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారు. బయట పబ్‌జీలు ఆడుకుంటూ మాట్లాడుతున్నారు' అని దుయ్యబట్టారు. 'బాధ్యత కలిగిన వ్యక్తి అయితే అసెంబ్లీలో ఉండాలి. వారు ఏదైనా చెబితే అందులో వాస్తవం ఉంటే సరిచేసుకుంటాం. అబద్ధమైతే నిలదీస్తాం. రెండూ చేయకుండా బయట గొడవ చేస్తాం, శాసనమండలి కార్యకలాపాలు జరగనీయం అనేలా వ్యవహరిస్తున్నారు. ఈ తీరును ఉపేక్షించం. ప్రజలే వారిని ఛీకొట్టే రోజు వస్తుంది' అని పేర్కొన్నారు. 'జెన్ జీ అంటూ గంజాయి బ్యాచ్‌లను తెచ్చారు. ఒడిశా నుంచి రోజు కూలీల్ని తెచ్చి వాళ్లతో మాట్లాడిస్తున్నారు. నిరుద్యోగుల్లో అనుమానాలు సృష్టించి, అడ్డదారుల్లో వెళ్తే ఉద్యోగాలొస్తాయని మోసాలు చేస్తున్నారు' అని చంద్రబాబు విమర్శించారు.

**ఒక్క ఉపాధ్యాయుణ్నయినా నియమించారా?...** '2019-24 మధ్య విద్యారంగాన్ని అభివృద్ధి చేశామని డబ్బాలు

ఒక రాజకీయ పార్టీ తరఫున ఎన్నికైన ఎమ్మెల్యేలు రెండున్నరేళ్లు అసెంబ్లీకి రాకపోవడం మొదటిసారి చూస్తున్నా.. మళ్లీ జీతాలు తీసుకుంటారు. వారికి బయట ప్రివిలేజెస్ (అధికారాలు) కూడా కావాలి. -చంద్రబాబు

'మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు తమ ఆత్మాభిమానం దెబ్బతీయొద్దు అంటూ రోడ్డెక్కారు. ఉద్యోగాలు రాని వారు కూడా డీఎస్సీ పారదర్శకంగా జరిగిందంటున్నారు. 'మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు తమ ఆత్మాభిమానం దెబ్బతీయొద్దు అంటూ రోడ్డెక్కారు. ఉద్యోగాలు రాని వారు కూడా డీఎస్సీ పారదర్శకంగా జరిగిందంటున్నారు. తమకూ అవకాశం వస్తుందని చెబుతున్నారు. అందరికీ వ్యవస్థపై నమ్మకం ఉంది. ఇంకా పటిష్ఠమైన విధానం ఉంటే అదీ అందుబాటులోకి తెస్తాం. సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుకుని విద్యావిధానం, పరీక్షల్లోనూ సంస్కరణలు తెస్తాం. ప్రతిభను ప్రోత్సహిస్తాం'
- అసెంబ్లీలో చంద్రబాబు



## కుమార్తెను వేధిస్తున్నాడని.. గోదావరిలో దూకిన.. ఏఈ కుటుంబం

- ఆయన మృతదేహం లభ్యం...భార్య, కుమార్తె కోసం గాలింపు
- నదిలో ఈదుతూ ప్రాణాలతో బయటపడ్డ పదేళ్ల మనవడు
- కాకినాడకు చెందిన రైఫిల్ షూటింగ్ కోచ్ వేధింపులే కారణమని లేఖ రాసిన ఏఈ

2 లో



**రాజమహేంద్రవరం :** తమ చిన్నారికి క్రీడల్లో నైపుణ్యాలు నేర్పిస్తాడని నమ్మిన శిక్షకుడే.. ఆ కుటుంబం పాలిట యముడయ్యాడు. అతని వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురైన కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ కుటుంబం గోదావరిలో దూకేసింది. వీరిలో పదేళ్ల బాలుడు ఈదుకుంటూ మత్స్యకారుల సాయంతో సురక్షితంగా బయటపడ్డాడు. సోమవారం సాయంత్రం ఇంజినీర్ మృతదేహం బయటపడగా ఆయన భార్య, కుమార్తె కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషాద ఘటన వివరాలివీ.. కాకినాడ అశోకనగర్‌లో నివాసముంటున్న తిల్లపూడి నూకరాజు (61) పిఠాపురం మండలంలో పంచాయతీరాజ్ ఏఈగా గత పదేళ్లుగా విధులు నిర్వరిస్తున్నారు. వచ్చే జనవరిలో ఆయన ఉద్యోగ

# సభలోనైనా.. బయటైనా.. చర్చకు సిద్ధం..!!

గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి ఇదే నా ఛాలెంజ్
కుంభకోణాలకు జగన్‌దే పేటెంట్
క్రీడాకోటాలో పారదర్శకంగా పోస్టుల భర్తీ
అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి లోకేశ్



**అమరావతి:** "గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్‌కు ఛాలెంజ్ చేస్తున్నా.. విలేకర్ల సమావేశాలెందుకు? సభకు రమ్మనండి. సమయం, తేదీ వారినే నిర్ణయించమనండి. చర్చకు నేను సిద్ధం. సభలో అయినా, బయటైనా సరే సిద్ధం. పారిపోవట్లేదు. జగన్‌లా నాపై సీబీఐ, ఈడీ కేసులు లేవు. విదేశాలకు వెళ్లాలంటే అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు" అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీ-2025పై వస్తున్న ఆరోపణలకు ఆయన శాసనసభలో సోమవారం సమాధానమిచ్చారు. "డీఎస్సీని ఎంత పకడ్బందీగా నిర్వహించామో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మంత్రిగా నాపై ఉంది. రాజ్యాంగం ప్రకారం వెర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ అమలుచేశాం. ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 16, 347 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చాం. మొత్తం ప్రక్రియను 148 రోజుల్లో పూర్తిచేశాం" అని తెలిపారు.

**నాడు మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టారు...** "తెదేపా ప్రభుత్వ హయాంలో మొత్తం 1.80 లక్షల టీచర్ పోస్టులు భర్తీచేశాం. వైకాపా హయాంలో ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు. మేం టీచర్లను శిక్షణకు సింగపూర్, ఫిన్లాండ్ పంపిస్తుంటే వైకాపా హయాంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ఎదుట కాపలా పెట్టారు. యువగళం పాదయాత్ర సమయంలో ఆదోని, ఆలూరు, మంత్రాలయం నుంచి పనుల కోసం గుంటూరుకు వలస వెళ్లడం చూశాను. మెగా డీఎస్సీలో కర్నూలుకే 10% మందిని నియమించాం. రాబోయే డీఎస్సీలోనూ ఇంకా పోస్టులు ఇస్తాం" అని పేర్కొన్నారు.

**148 రోజుల్లో 141 కేసులు...** కేంద్రం తీసుకొచ్చిన క్రీడా విధానాన్నే రాష్ట్రంలోనూ అమలు చేశాం. గతంలో 29 కేటగిరీలు ఉంటే 65 క్రీడా కేటగిరీలను అమలు చేశాం. డీఎస్సీని అడ్డుకోవాలని వైకాపా వారు 148 రోజుల్లో 141 కేసులు వేశారు. గతంలో ఇచ్చిన ప్రకటనలను అధ్యయనం చేసి, ఏఐ ద్వారా విశ్లేషించి మోడల్ నోటిఫికేషన్ తెచ్చాం. అన్నింటినీ న్యాయబద్ధంగా పరిష్కరించి 12 దశల్లో నియామక ప్రక్రియ పూర్తిచేశాం. అభ్యర్థుల మనోభావాలకు అనుగుణంగా ప్రక్రియ నిర్వహించాం" అని లోకేశ్ తెలిపారు.

**దాన్ని హ్యాక్ చేయడం ఎవరికీ సాధ్యం కాదు...** "సబ్జెక్టు నిపుణులు 42వేల ప్రశ్నలతో క్వశ్చన్ బ్యాంకు తయారుచేశారు. టీసీఎస్ అయాన్ వాళ్లు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేశారు. 256 ఎన్‌క్రిప్షన్‌లో దీన్ని చేపట్టాం. దీన్ని హ్యాక్ చేయడం ఎవరికీ సాధ్యం కాదు. మెగా డీఎస్సీ మొత్తం ప్రక్రియ పూర్తయిన ఏడాది

..2వ పేజీలో



## ఆరు నెలలకో ఆసుపత్రి

2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ హాస్పిటళ్లు
భారాస హయాంలోనే టిమ్స్‌లను కట్టి ఉంటే ప్రారంభించే సమయం దొరకలేదా
వైద్యం కోసం రూ.21,800 కోట్లు ఖర్చు చేశాం...
సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్:** 'ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం వేగంగా చేపట్టి ప్రతి ఆరు నెలలకొకటి చొప్పున ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. 2027 డిసెంబరు లోపు అన్నింటినీ పూర్తి చేస్తాం. వీటి ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 వేల పడకలు సమకూరుతాయి. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లో నిర్మించిన డా.మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆసుపత్రిని ఆయన సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి ప్రారంభించారు. తొలుత అన్ని బ్లాకులను కలియదిరిగిన సీఎం.. వైద్యులను అడిగి అక్కడి సేవలను తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. "మేం టిమ్స్‌ను ప్రారంభిస్తామని చెప్పగానే సనత్‌నగర్ ఎమ్మెల్యేతో కలిసి కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. మీరే కడితే

..2వ పేజీలో

పల్లె సాక్షి



# మెగా డీఎస్సీపై బురదచల్లి పారిపోతున్న వైకాపా..!!

**(మొదటిపేజి తరువాయి)** కొట్టుకున్నారు. ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయుణ్ని అయినా నియమించారా?' అని చంద్రబాబు నిలదీశారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశాం. ప్రతిభ ప్రకారమే 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే నియామక ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి, అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి, ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేపట్టాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పిలేట్ అథారిటీని కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు' అని వివరించారు.

**ఒక్క ఫిర్యాదూ లేకుండా 11 డీఎస్సీలు నిర్వహించాం...** 'ఇప్పటి వరకు మొత్తం 14 డీఎస్సీలు జరిగితే అందులో 11 డీఎస్సీలు మా ప్రభుత్వ హయాంలో తెచ్చినవే. ఇప్పుడున్న ఉపాధ్యాయుల్లో 80% మంది ఆ డీఎస్సీల ద్వారా నియమితులైనవారే. అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. ఎన్టీఆర్ హయాంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారు. మహిళలకు ఉన్నత విద్య అందించేందుకు విద్యావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నేను సీఎం అయ్యాక కిలోమీటరుకు ఒక ప్రాథమిక పాఠశాల, మండలానికి ఒక జూనియర్ కళాశాల, ఇంజినీరింగ్ కాలేజి, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశాం. విద్యార్థులకు డ్రై రేషన్, మధ్యాహ్న భోజన పథకాల్ని కూడా తెదేపా ప్రభుత్వ హయాంలోనే ప్రవేశపెట్టాం. ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం పెడితే వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పునరుద్ధరించాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థల్లో ప్రవేశపరీక్షలతోపాటు పోటీ పరీక్షలకూ సిద్ధం చేస్తున్నాం' అని సీఎం వివరించారు.

**వైకాపా హయాంలో 12 లక్షల మంది బడికి దూరం...** 'వైకాపా ఐదేళ్ల పాలనలో 10-12 లక్షల మంది విద్యార్థులు బడికి దూరమయ్యారు. అందుకే తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఆర్థిక సాయం అందించేలా నిర్ణయం తీసుకున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా ప్రమాణాలు పెరగడంతో.. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు లక్ష మందికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు' అని చంద్రబాబు వివరించారు. 'ఒకే కులానికి ఉద్యోగాలిచ్చారని ఒక విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్లేకార్డులు ఆడుకునే వారికి ఉద్యోగాలిచ్చారని ఒక మాజీ మంత్రి విమర్శిస్తున్నారు. 2024లో కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే క్రీడా కోటాలో నియామకాలు చేశాం. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారు. అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారు. ఆరోపణల్ని ఇక సహించలేక ఇప్పుడు టీచర్లే రోడ్డుపైకి వచ్చారు. కర్నూలు, విజయవాడల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. పిల్లలకు పాఠాలు చెబుతాం, మా ప్రతిభను కించపరిస్తే గుణపాఠం కూడా చెబుతామని నినదించారు' అని సీఎం చెప్పారు.

## తొలగించిన ఓట్లు 'క్యూర్'లోనే అధికం

**(మొదటిపేజి తరువాయి)** 2002 జాబితాలోని తల్లిదండ్రులు, రక్తసంబంధీకుల వివరాలు ఇవ్వాలి. అయితే నమోదులో ఆ వివరాలు లేకపోవడం... ఉన్నా తప్పుగా పూర్తిచేయడంతో ఆయా ఓటర్లను నాన్ మ్యాపింగ్ కేటగిరీలో చేర్చారు. ఈ ఓటర్లకు ఎన్నికల సంఘం నోటీసులు జారీచేసి వారి నుంచి అభ్యంతరాలు నమోదు చేసి, తుది జాబితాలో చోటుపై నిర్ణయం తీసుకుంటుంది. ఇలా మ్యాపింగ్ చేయని ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం కూకట్‌పల్లి. వివరాలను సరిగా మ్యాపింగ్ చేసిన నియోజకవర్గాల్లో వేములవాడ ముందుంది.

**గ్రామీణ ప్రాంతాలు భేష్...** సర్‌లో గ్రామీణ ప్రాంతాలు ఆదర్శంగా నిలిచాయి. 26 నియోజకవర్గాల్లో 90 శాతానికిపైగా డిజిటలైజేషన్ పూర్తయింది. గ్రామీణ నియోజకవర్గాల్లో.. మరణం, శాశ్వత వలస, ఇతర కారణాలతో తొలగించిన ఓట్లు కూడా కేవలం 10శాతం లోపు ఉన్నాయి. భువనగిరిలోని ఆలేరు 95.7 శాతం డిజిటలైజేషన్‌తో టాప్-1గా నిలిచింది. అత్యల్పంగా ముషీరాబాద్‌లో 54.83 శాతం ఫారాలు మాత్రమే డిజిటలైజేషన్ అయ్యాయి.

**జిల్లాల వారీగా వివరాలివీ...** కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా సోమవారం రాష్ట్రంలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించింది. జిల్లాల వారీగా వివరాలు...

### నితిన్ నబిన్ కొత్త టీమ్ రెడీ.. పురందరేశ్వరీ, వసుంధర రాజేకు కీలక బాధ్యతలు..!

ఏడు నెలల తర్వాత భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన కొత్త టీమ్‌ను ప్రకటించారు. పార్టీ భవిష్యత్ వ్యూహాలు, సంస్థాగత బలోపేతాన్ని దృష్టిలో పెట్టుకుని కీలక



పదవుల్లో మార్పులు, చేర్పులు చేశారు. కొత్త కార్యవర్గంలో పలువురు సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించగా.. మరికొందరికి పదవులు కొనసాగించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా మొత్తం 13 మందిని నియమించారు. ఇందులో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే, ఆంధ్రప్రదేశ్ నుంచి రామ్ మాధవ్, పురంధేశ్వరి వంటి కీలక నేతలకు చోటు దక్కింది. ఇదే సమయంలో తెలంగాణకు చెందిన డీకే అరుణను జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారు. కొత్త జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు ప్రాతినిధ్యం దక్కకపోవడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా మొత్తం ఎనిమిది మందిని నియమించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ జనరల్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న బీఎల్ సంతోష్‌ను సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవిలో కొనసాగించారు. ఆయనకు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక బాధ్యతలు యథావిధిగా కొనసాగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డికి కూడా కొత్త బృందంలో కీలక బాధ్యత లభించింది. ఆయనను జాయింట్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. అలాగే కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా తరుణ్ చుగ్‌ను నియమించారు. ఓబీసీ విభాగానికి కొత్త అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్యను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక వ్యవహారాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను పార్టీ కోశాధికారిగా నియమించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన రాజేష్ అగర్వాల్ స్థానంలో పీయూష్ గోయల్ బాధ్యతలు చేపట్టనున్నారు. రాజేష్ మంగళ్‌ను సహ-కోశాధికారిగా నియమించారు. ఇక పార్టీ మీడియా వ్యవహారాల్లో అనిల్ బలూని తన బాధ్యతల్లో కొనసాగనున్నారు. పార్టీకి సంబంధించిన మీడియా కమ్యూనికేషన్, ప్రచార వ్యూహాల్లో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. కొత్త కార్యవర్గ కూర్పులో ప్రాంతీయ సమీకరణాలు, అనుభవం, సంస్థాగత సామర్థ్యం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలను పరిగణనలోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సీనియర్ నేతలతో పాటు కొత్త తరానికి చెందిన నేతలకు కూడా బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యం కనిపిస్తోంది. అయితే తెలంగాణకు కొత్త జాతీయ కార్యవర్గంలో చోటు దక్కకపోవడం చర్చకు దారితీస్తోంది. గతంలో జాతీయ స్థాయిలో కీలక పదవుల్లో ఉన్న నేతలకు ప్రస్తుత కూర్పులో ప్రాధాన్యం తగ్గడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. మరోవైపు వసుంధర రాజే, రామ్ మాధవ్, పురంధేశ్వరి వంటి నేతలకు ఉపాధ్యక్ష బాధ్యతలు ఇవ్వడం బీజేపీ జాతీయ స్థాయిలో తీసుకున్న కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. మొత్తంగా నితిన్ నబిన్ కొత్త టీమ్‌లో భారీ మార్పులు, కీలక నియామకాలు చోటుచేసుకున్నాయి. రానున్న రోజుల్లో ఈ కొత్త కార్యవర్గం పార్టీ సంస్థాగత విస్తరణ, రాష్ట్రాల వారీగా రాజకీయ వ్యూహాలు, ఎన్నికల సన్నద్ధతలో ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## కుమార్తెను వేధిస్తున్నాడని.. గోదావరిలో దూకిన ఏఈ కుటుంబం

**(మొదటిపేజి తరువాయి)** విరమణ చేయాల్సి ఉంది. ఆదివారం అర్ధరాత్రి భార్య మీనా (58), కుమార్తె కోవూరి సౌజన్య (38), మనుమడు రియాన్ష్ కార్తికేయరెడ్డి(10)తో కలిసి కారులో రాజమహేంద్రవరం వచ్చారు. రోడ్డు కం రైలు వంతెనపై కారు నిలిపి నలుగురూ గోదావరిలో దూకేశారు. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వెంటనే సమీప లంకల్లోని మత్స్యకారులను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈత వచ్చిన కార్తికేయ దాదాపు 20 నిమిషాల పాటు గోదావరిలో ఈదుతూ హెల్ప్‌హెల్ప్ అని అరిచాడు. మత్స్యకారులు బాలుణ్ని గమనించి వెంటనే పడవలో ఒడ్డుకు చేర్చారు. కాలు, నడుంపై స్వల్పగాయాలైన కార్తికేయకు పోలీసులు ఓ ఆసుపత్రిలో చికిత్స అందించి, బంధువులకు అప్పగించారు. మిగతావారి కోసం అగ్నిమాపక శాఖ సిబ్బంది, గజ ఈతగాళ్లు ప్రత్యేక బోట్లతో గోదావరిలో గాలింపు చేపట్టారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు నూకరాజు మృతదేహం రాజమహేంద్రవరంలోని దోబీఘాట్ వద్ద లభించింది.

**డ్రైవర్‌ను పంపించేసి.. కుమార్తెతో కారు నడిపించి..** ఏఈ నూకరాజు కాకినాడ నుంచి కుటుంబంతో కలిసి తొలుత రాజమహేంద్రవరం వచ్చి అనంతరం కొవ్వూరు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో డ్రైవర్ కారు నడుపుతున్నారు. తాము తర్వాత వస్తామని, వెనక్కి వెళ్లిపోవాలని డ్రైవర్‌కు డబ్బులిచ్చి పంపేశారు. అక్కడ అల్పాహారం చేశాక కారును నూకరాజు కుమార్తె సౌజన్య నడిపారు. అర్ధరాత్రి రాజమహేంద్రవరం వైపు వచ్చి వంతెనపై ఆపి, నదిలోకి దూకినట్లు పోలీసులు భావిస్తున్నారు.

**సాధిక్‌ఖాన్ వేధింపులు భరించలేకే చనిపోతున్నాం..** కాకినాడకు చెందిన ప్రో రైఫిల్ షూటింగ్ నిర్వాహకుడు షేక్ సాధిక్‌ఖాన్ వేధింపులు, హింస భరించలేక తామంతా చనిపోవాలని నిర్ణయించుకున్నామని నూకరాజు లేఖ రాశారు. 'నా అల్లుడు జులై 2న మరణించాడు. ఆ తరువాత నా కుమార్తెకు సహాయంగా ఉంటానని సాధిక్ ప్రతిపాదించాడు. మేం అంగీకరించలేదు. ఐదో తరగతి చదువుతున్న నా మనవణ్ని, నన్ను చంపుతానని మా అమ్మాయిని బెదిరించి విలువైన వస్తువులు, బ్యాంకు ఖాతాలు అతని ఆధీనంలోకి తీసుకున్నాడు. పరువుగా బతికిన మా అమ్మాయిని చాలా హింసిస్తున్నాడు. మేం ఏమైనా చెబితే చంపుతానంటున్నాడు. ఇదంతా తట్టుకోలేక నేను, నా భార్య, కుమార్తె, మనవడితో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నా. ఆ దుర్మార్గుణ్ని కఠినంగా శిక్షించాలి' అని కలెక్టర్, ఎస్పీలను కోరుతూ రాసిన లేఖను ఆయన వాట్సప్‌లో సహోద్యోగులు, మరికొందరికి ఆదివారం రాత్రి 11.27 గంటలకు పంపించారు.

**గతంలో విద్యార్థినితో సాధిక్ అసభ్య ప్రవర్తన ...** సాధిక్‌ఖాన్ కాకినాడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో షూటింగ్ కోచ్‌గా పనిచేసేవాడు. అక్కడ ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు రావడంతో అతణ్ని తొలగించారు. తర్వాత అతను సొంతంగా అకాడమీ పెట్టుకున్నాడు. కొన్నాళ్ల కిందట సౌజన్యకు సాధిక్ పరిచయమయ్యాడని, ఆమెను వేధిస్తున్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న నిందితుడు సాధిక్‌ఖాన్‌ను పట్టుకునేందుకు 10 బృందాలతో గాలిస్తున్నామని రాజమహేంద్రవరం రెండో పట్టణ స్టేషన్ సీఐ శివగణేశ్ తెలిపారు. కాగా నూకరాజు, మీనా దంపతుల కుమారుడు కొన్నేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

**మమ్మీని దూకకుండా ఆపుదామని ప్రయత్నించా...** 'సాధిక్ మా ఇంటికి వస్తుంటాడు. మమ్మీని రోజూ చాలా గట్టిగా కొడుతున్నాడు. గొడవ చేస్తున్నాడు. బంగారం, డబ్బులు, లాకర్ తాళాలన్నీ తీసుకున్నాడు' అని కార్తికేయ 'ఈనాడు'కు వెల్లడించాడు. 'రాత్రి మేమంతా కలిసి తిన్నాం. వంతెన వద్దకు వచ్చిన తరువాత అందరూ దూకేయాలని తాత చెప్పారు. అమ్మ నా చేయి పట్టుకుని దూకేసింది. నేను అమ్మను వెనక్కి లాగుదామని ప్రయత్నించా. బరువు వల్ల నేను కూడా నీటిలో పడిపోయాను. చీకట్లో చాలా భయం వేసింది. చిన్నప్పుడు ఈత నేర్చుకున్నా. అలాగే ఈదుతూ హెల్ప్ అని అరిచాను' అని వివరించాడు.

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి: ఉప ముఖ్యమంత్రి**

రాజమహేంద్రవరం సమీపంలో పంచాయతీరాజ్‌శాఖ ఏఈ నూకరాజు కుటుంబంతో సహా గోదావరిలో దూకిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి, కాకినాడ ఎస్పీలతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఘటనపై విచారణ జరిపి, ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెదిరింపులు, వేధింపులు, ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు పోలీసులు, సంబంధిత అధికారులను సంప్రదించి చట్టపరమైన సహాయం పొందాలని.. తొందరపడి ప్రాణాలు తీసుకోవద్దని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు.

# సభలోనైనా.. బయటైనా.. చర్చకు సిద్ధం..!!

తర్వాత వైకాపా నాయకులు ప్రశ్నపత్రం లీకైందని గొడవ చేస్తున్నారు. డీఎస్సీపై అవగాహన లేని ప్రతిపక్షం రాష్ట్రంలో ఉంది. వైకాపా అధికార ప్రతినిధి ఒకరు చర్చలో డీఎస్సీ అంటే డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ అన్నారు. అర్థం తెలియని వాళ్లు డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారు. ఆన్‌లైన్‌లో 89 విడతల్లో 13 సబ్జెక్టులు, 67 రకాల పోస్టులకు 24 రోజుల్లో పరీక్షలు పూర్తిచేశాం. 33,840 గ్రీవెన్స్ వచ్చాయి. వీటిలో 36 మాత్రమే తుది అప్పిలేట్ అథారిటీకి వచ్చాయి. మెరిట్ జాబితా, ఎంపిక జాబితాలను వెబ్‌సైట్‌లో పెట్టాం. ప్రతి దశలోనూ అభ్యర్థుల సెల్‌ఫోన్లకు సమాచారం అందించాం" అని మంత్రి పేర్కొన్నారు.

**క్రీడల ప్రోత్సాహంలో భాగమే...** 'క్రీడాకోటాపై వైకాపా వాళు ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్రంలో క్రీడాకారులకు భూమి కేటాయించడం కొత్తకాదు. పీవీ సింధుకు ప్రభుత్వోద్యోగం ఇచ్చాం. మరి కొన్నేళ్లల్లో ఆమె ఐఏఎస్ అధికారి కానున్నారు. యర్రా జ్యోతి ఉత్తరాంధ్ర బిడ్డ. సీఎంకు చెబితే వెంటనే ఉద్యోగం ఇవ్వాలన్నారు. క్రికెటర్ శ్రీచరణికి డిగ్రీ పూర్తయ్యాక ప్రభుత్వోద్యోగం ఇవ్వాలని సీఎం చెప్పారు. క్రీడాకోటా పోస్టుల భర్తీ పారదర్శకంగా నిర్వహించాం. ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎంపీ భరత్, మరో ఎంపీ అసోసియేషన్ల బాధ్యతల్లో ఉన్నందున వారికి అనుకూలమైన వారికి



ఉద్యోగాలు ఇచ్చారనడం తప్పు. ఆధారాలుంటే తీసుకురండి. ఆధారాలు లేకుండా ఏడాది తర్వాత ఇప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరం" అని తెలిపారు.

**అంబేద్కర్‌నే ప్రశ్నిస్తున్నారు: మంత్రి లోకేశ్**

కుంభకోణాలు జగన్‌కు, ఆయన కుటుంబానికి పేటెంట్. రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు డీఎస్సీ పేపర్ లీక్ అయింది. జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి ఓఎమ్మార్ షీట్లను హైదరాబాద్ తీసుకెళ్లారు. ఉపాధ్యాయుల బదిలీల చట్టంలా నియామకాలకు చట్టం తేవాలని ఆలోచన చేస్తున్నాం. అన్ని ప్రభుత్వ బడుల్లో నో అడ్మిషన్ల బోర్డులు రావాలన్నదే నా ధ్యేయం. మెగా డీఎస్సీలో కొందరికి ఉద్యోగాలు రాలేదు. మళ్లీ పరీక్ష పెడుతున్నాం. పటిష్ఠమైన మెకానిజంపై సలహాలు, సూచనలు అందించండి. రాజ్యాంగంలో రిజర్వేషన్ విధానాన్ని అంబేద్కర్ తీసుకొచ్చారు. వెర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్‌ను పారదర్శకంగా నిర్వహించే లక్ష్యంతో మేము ఉన్నాం. గొడ్డలి పార్టీ నాయకుడు.. అంబేద్కర్‌నే ప్రశ్నిస్తున్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రశ్నిస్తే ఊరుకోం.

# సంపాదకీయం

## క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సులో ఏపీ విద్యార్థుల ప్రతిభ

### 4 స్వర్ణ, 14 రజత పతకాలు...అభినందించిన సీఎం చంద్రబాబు

**అమరావతి:** క్వాంటమ్ కంప్యూటింగ్‌లో నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్(ఎన్‌పీటీఈఎల్) నిర్వహించిన పరీక్షలో స్వర్ణ, రజత పతకాలు సాధించిన



విద్యార్థులను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. రాష్ట్రంలో లక్ష మందిని క్వాంటమ్ నిపుణులుగా తయారు చేసే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. క్వాంటమ్ అల్గారిథమ్స్ అండ్ క్విస్కిట్‌లో ఐఐటీ మద్రాస్, ఐఐఎస్సీ సంయుక్తంగా ఎన్‌పీటీఈఎల్ ద్వారా పరీక్ష నిర్వహించాయి. ఇందులో ఏపీ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ కోర్సుకు రాష్ట్రం నుంచి 1.04 లక్షల మంది దరఖాస్తు చేస్తే.. ఇతర రాష్ట్రాల నుంచి 1.04 లక్షల దరఖాస్తులు అందాయి. ఏపీ నుంచి 19 వేల మంది, మిగిలిన రాష్ట్రాల నుంచి 11 వేల మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో రాష్ట్రానికి చెందిన 2,839 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 2,700 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఏపీ విద్యార్థులు 4 స్వర్ణ, 14 రజత పతకాలు దక్కించుకుంటే.. ఇతర రాష్ట్రాల విద్యార్థులు 4 స్వర్ణ, 16 రజత పతకాలు పొందారు. విశాఖకు చెందిన సీహెచ్ రామ సౌజన్య, విజయవాడకు చెందిన సౌమ్యశ్రీ, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన అనిల్ శ్రీనివాస్, రాజమహేంద్రవరానికి చెందిన యశ్వంత్‌లకు బంగారు పతకాలు దక్కాయి. రాష్ట్ర విద్యార్థులకు దక్కిన 14 రజత పతకాల్లో నూజివీడు ఆర్జీయూకేటీ విద్యార్థులు అత్యధికంగా 7 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన వారిలో ఆరుగురికి క్వాంటమ్ కంప్యూటింగ్ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. ఐబీఎం, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టీసీఎస్, ఇన్ఫోసిస్, గూగుల్ వంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును తీర్చిదిద్దారు.

## ఆరు నెలలకో ఆసుపత్రి

**(మొదటిపేజి తరువాయి)** పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ ఫాంహౌస్‌ల నిర్మాణం ఆలస్యం కానివ్వలేదుగానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తిచేయాలనే ఆలోచన రాలేదా? ఇంకా ఎన్ని రోజులు అబద్ధాలు ప్రచారం చేస్తారు..



మీరు అబద్ధాలు చెప్పడం ఆపనంత కాలం నేను నిజాలు చెబుతూనే ఉంటా. కేసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలానే ఉండాలని కోరుకుంటున్నా. అప్పుడు మా పని సులువవుతుంది. వానలు కురవకూడదని, ప్రజలు నాశనం కావాలని కోరుతూ క్షుద్ర పూజలు చేస్తున్నారు. మీరు సంపాదించిన రూ.లక్ష కోట్లల్లో నియోజకవర్గానికో రూ.10-20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయి.

**విద్య, వైద్యంపై చేసేది ఖర్చు కాదు.. పెట్టుబడి**

ప్రజా ప్రభుత్వం వైద్యం, విద్య కోసం నిధులు వెచ్చించడాన్ని ఖర్చులా చూడటం లేదు. పెట్టుబడిగా భావిస్తోంది. పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరితే బిల్లులు చెల్లించేందుకు ఆస్తులు అమ్ముకున్నా చాలడం లేదు. రాష్ట్రంలో 4 కోట్ల మందికి వైద్యసేవలు అందించే లక్ష్యంతో ఆధునిక వైద్య సేవలు ప్రారంభిస్తున్నాం. 32 నెలల పరిపాలనలో ఆరోగ్యశ్రీలో రూ.2,700 కోట్లు ఖర్చు పెట్టాం. సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2,500 కోట్లు వెచ్చించాం. దేశంలో పేదల కోసం ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో నిధులు కేటాయించలేదు. వైద్యశాఖపరంగా ఏటా రూ.13 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే.. ప్రజా ప్రభుత్వం వచ్చాక రూ.21,800 కోట్లు వెచ్చించాం. ఇది బాధ్యతగా భావిస్తున్నాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరి వానాకాలంలో వరద వచ్చి రోగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లకు ఆ ఆసుపత్రిని ఇంకోచోట నిర్మించాలన్న ఆలోచన రాలేదు. రూ.2,700 కోట్లతో మా ప్రభుత్వం ఆసుపత్రిని వేరేచోట నిర్మిస్తోంది. మూడు టిమ్స్ ఆసుపత్రులకు టెంకాయ కొట్టారు. నిధులు, నిర్మాణం మాత్రం మరచిపోయారు. వరంగల్ ఆసుపత్రిది కూడా అదే పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిసారించాం.

**అదనపు గంటలు పనిచేస్తే ప్రోత్సాహకాలు...** అదనపు గంటలు పనిచేసే సూపర్ స్పెషాలిటీ వైద్యులు, సిబ్బందికి ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ నుంచి ప్రోత్సాహకాలు అందించే ఆలోచన చేయాలి(మంత్రి దామోదర్ రాజనర్సింహకు సూచిస్తూ). విద్యార్థులకు నర్సరీ



నుంచి 12వ తరగతి వరకు మెరుగైన విద్య అందించి.. స్కిల్స్ నేర్పితే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటారు. ఎవరూ ఇష్టంతో ఉచితంగా సంక్షేమ పథకాలు తీసుకోరు. ఎలాంటి పని కల్పించనప్పుడే సంక్షేమ పథకాలు వైపు చూస్తారు. నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి. విదేశీ భాషలు నేర్చుకుంటే రూ.లక్షల జీతాలు వస్తాయి' అని సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్‌యాదవ్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు ప్రొ.కోదండరాం, బల్మూరి వెంకట్, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, డీఎంఈ డా.వాణి, టిమ్స్ డైరెక్టర్ డా.నరేందర్‌కుమార్, నిమ్స్ డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవ్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్‌లో వేయి రోబోటిక్ సర్జరీలు పూర్తి చేసిన వైద్య బృందం, గుత్తేదారు సంస్థ మేఘా ఇంజినీరింగ్ అధినేత కృష్ణారెడ్డి బృందాన్ని సీఎం జ్ఞాపికలతో సత్కరించారు. అంతకుముందు సీఎం చేతులు మీదుగా టీజీసేఫ్, ఆరోగ్య దీపిక పాలీ క్లినిక్‌లను ఆన్‌లైన్‌లో ప్రారంభించారు.

APTEL 2022 / 16169
టుడే పల్లె సాక్షి
కర్నూలు
నంద్యాల

# ఏపీలో ప్రతి ఇంటికీ పైప్డ్ గ్యాస్

### మంత్రి బిసి జనార్దన్ రెడ్డి

**బనగానపల్లె ఆగస్టు 17 పల్లె సాక్షి** బనగానపల్లె మండలం ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబానికి పైప్డ్ న్యాచురల్ గ్యాస్ (గ్రాచీ+) కనెక్షన్ అందించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న గ్రాచీ+ కనెక్షన్ల



విస్తరణను మరింత వేగవంతం చేసి, భవిష్యత్‌లో ప్రతి ఇంటికీ పైపులైన్‌ద్వారాసహజ వాయువు అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వలక్ష్యంగా కనిపిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు ఉన్నాయని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శాసనమండలిలో వెల్లడించారు. గ్రాచీ+ కనెక్షన్లకు సంబంధించి ఎమ్మెల్సీలు బీటీనాయుడు, బీద రవిచంద్ర, పి.రాజశేఖరం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు సమర్పించిన నివేదికల ప్రకారం.. 2026 ఆగస్టు 13 నాటికి రాష్ట్రంలో 90,013 గృహ వినియోగ పైప్డ్ న్యాచురల్ గ్యాస్ కనెక్షన్లు అందించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్లపై ఆధారపడుతున్న కుటుంబాలకుప్రత్యామ్నాయంగా పైప్డ్ న్యాచురల్ గ్యాస్ అందుబాటులోకి వస్తే వంట ఇంధనవినియోగంలో మరింత సౌలభ్యం కలగనుంది. ఇంటికి నేరుగా పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా కావడం వల్ల సిలిండర్ బుకింగ్, రవాణా, నిల్వ వంటి అంశాలతో వినియోగదారులకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో గ్రాచీ+ నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా మరింత మంది గృహ వినియోగదారులను ఈ వ్యవస్థలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే వివిధ నగరాలు, పట్టణాల్లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థల ఆధ్వర్యంలో పైపులైన్ల ఏర్పాటు, గృహ కనెక్షన్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. మౌలిక వసతుల విస్తరణతో పాటు కొత్త వినియోగదారులకు కనెక్షన్లు అందించే ప్రక్రియను దశలవారీగాచేపడుతున్నారు. మిగిలిన అర్హత కలిగిన వినియోగదారులకుగ్రాచీ+ కనెక్షన్లు అందించే ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ గ్రాచీ+ అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ ప్రతిపాదన అమలైతే రాష్ట్ర ఇంధన వినియోగ రంగంలో ఇది కీలకమైన మార్పుగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా పట్టణాలు, శివారు ప్రాంతాల్లో పెరుగుతున్న గృహ అవసరాలకు అనుగుణంగా గ్యాస్ పంపిణీ వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ విస్తరణ, పైపులైన్ల ఏర్పాటు, కొత్త కనెక్షన్ల మంజూరు వంటి అంశాలు కీలకం కానున్నాయి. శాసనమండలిలో మంత్రి ఇచ్చిన సమాధానం ప్రకారం ఇప్పటికే 90 వేలకు పైగా కుటుంబాలు గ్రాచీ+ సేవలను పొందుతున్నాయి. మిగిలిన కుటుంబాలకు కూడా దశలవారీగా ఈ సదుపాయాన్ని విస్తరించే ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కుటుంబానికి గ్రాచీ+ కనెక్షన్ అందించే ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే.. సంప్రదాయ వంట ఇంధన వినియోగానికి ప్రత్యామ్నాయంగా సహజవాయువు మరింత విస్తృతంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం 90,013 గృహాలకు చేరినగ్రాచీ+ నెట్‌వర్క్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడమే తదుపరి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. శాసనమండలిలో మంత్రి చేసిన ప్రకటనతో ప్రతి ఇంటికీ పైప్డ్ న్యాచురల్ గ్యాస్ అందించే ప్రభుత్వ ప్రణాళికపై స్పష్టత వచ్చింది.

# గుండె పోటు తో రైతు మృతి

### పరామర్శించిన మండల ఇంచార్జీ మురళీ రెడ్డి.

**కోసిగి టుడే (పల్లె సాక్షి) ఆగస్టు 17 :** కోసిగి మండల పరిధిలోని డి బెళగల్ గ్రామానికి చెందిన పబ్బిత లక్ష్మయ్య(72) అనే రైతు, ఎమ్మెల్యే అభిమాని గుండె పోటుకు గురై మృతి



చెందాడు. మృతుడి కి భార్య రేణుకమ్మ, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలరు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై బాల నాగిరెడ్డి ఫోన్ ద్వారా మృతుడి కుటుంబ సభ్యు లను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైపీసీ జిల్లా కార్యదర్శి/ కోసిగి మండలం ఇంచార్జీ మురళీ మోహన్ రెడ్డి స్థానిక నాయకులు దొడ్డి నరసన్న, మల్లికార్జున గౌడ్ తదితరులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహం పై పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే అండగా ఉంటారని చెప్పారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

### రెండేళ్లలో రాప్తాడు నియోజకవర్గానికి

# రూ.3 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

**రాప్తాడు :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాప్తాడు నియోజకవర్గంలో సుమారు రూ.2,919.39 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వివరించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రి లోకేష్ ను ఆయన ఛాంబర్‌లో ప్రత్యేకంగా కలిసిన ఆమె, నియోజకవర్గ ప్రగతి నివేదికను అందజేశారు. నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాలకు రూ.1,208.65 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1,700.74 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

### ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని...

# కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

### రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

### యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకాన్ని పునరుద్ధరించాలి...హెల్త్ కార్డు అమలులో ఇబ్బంది లేకుండా చూడాలి

### జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి...ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి

**కర్నూలు, ఆగస్టు 17,పల్లెసాక్షి** జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల ముందు మానిఫెస్టో లో పెట్టారని, కానీ ఇప్పటి వరకు దాని గురించి ఊసేలేదని, తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఇండియా జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు ఈ. ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోరంట్ల కొండప్ప, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, మస్తాన్, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర రావు, మల్లికార్జున డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే 70వ వార్షికోత్సవం పురస్కరించుకొని జర్నలిస్టుల డిమాండ్స్ డే పాటించారు. సోమవారం పీజీఆర్ఎస్ లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్కింగు జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (డబ్ల్యూజేహెచ్ఎస్) అమలులో నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎదురవు తున్న ఇబ్బందుల వల్ల పలువురు జర్నలిస్టులు ఆరోగ్య ప్రయోజనాలు పొందలేక పోతున్నారన్నారు. ప్రభుత్వం నుండి బకాయిలు ఉన్నాయన్న పేరుతో నెట్ వర్క్



ఆస్పత్రులలో డబ్ల్యూజేహెచ్ఎస్ కార్డును చాలా సందర్భాల్లో అనుమతించుట లేదన్నారు. కొన్ని ప్రాసెస్ లకు కూడా కార్డు వర్తించుట లేదన్నారు. ఇటువంటి లోటుపాట్లను సవరించి డబ్ల్యూజేహెచ్ఎస్ ను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరారు. పథకం అమల్లో ఎదురవుతున్న రోజువారీ సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్, , జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, తద్వారా జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని రెండేళ్ల గడిచిపోయిందని, ఇప్పటివరకూ ఈ విషయమై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం మినహా ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. 2018-19 లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకం ఆచరణలో అమలుకు నోచుకోలేదన్నారు. అందువల్ల మరింత జాప్యం లేకుండా ఇళ్ల స్థలాల విషయమై సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు వృత్తి ద్వారా సమాజానికి చేసిన సేవలకు గానీ, వేతనాలు గానీ, ఉద్యోగ విరమణ పింఛను గానీ లేని పరిస్థితులను, వారి వయసును దృష్టిలో ఉంచుకుని విశ్రాంత జీవితాన్ని గౌరవప్రదంగా గడపడానికి వీలుగా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని ఏపీలో కూడా ప్రారంభించాలని కోరారు. జర్నలిస్టులపై పెరిగిపోతున్న భౌతిక దాడులు, బెదిరింపులు, దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రతకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, సీనియర్ నాయకులు భాస్కర్, శ్రీనాథ్ రెడ్డి, సాగర్, రమేష్ రెడ్డి, సుధాకర్, పరమేష్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ సురక్షిత చైతన్య రథం

**బనగానపల్లె ఆగస్టు 17 పల్లె సాక్షి** బనగానపల్లె మండలం. హుసేనాపురంగ్రామంలో ఏపీ సాక్స్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దిశా ఆధ్వర్యంలోహెచ్ఐవి. ఎయిడ్స్ సుఖ వ్యాధుల లపై



అవగాహన కార్యక్రమంలో లింక్ వర్కర్ ఇన్ కృష్ణవేణి మాట్లాడుతూ హెచ్.ఐ.వి వ్యాధి పట్ల యువత కు హెచ్.ఐ.వి పట్ల అవగాహన కలిగి ఉండడం వల్ల హెచ్.ఐ.వి కి గురికాకుండాచూసుకోవచ్చని, చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. హెచ్.ఐ.వి కేవలం అసురక్షిత లైంగిక సంబంధాలు , హెచ్.ఐ.వి ఉన్న గర్భిణీ నుండి పుట్టబోయే బిడ్డకు, హెచ్ఐవితో కలుషితమైన సూదులు సిరంజీలు, పరీక్షింపబడని రక్తము ద్వారా మాత్రమే సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. ఇక ప్రభుత్వ ఆసుపత్రులలో హెచ్.ఐ.వి పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని అలాగే పరీక్షలు చేయించుకున్న వివరాలు గోప్యంగాఉంచబడతాయని తెలిపారు.అదేవిదంగా,హెచ్.ఐ.వి. ఉంది అని నిర్ధారణ అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్ట్ కేంద్రాలు, లింక్ ఆర్ట్ కేంద్రాల ద్వారా ఉచితంగా ఆర్ట్ మందులు అందుబాటులో ఉన్నాయని, మందులు వాడుతూ, వైద్యుల సలహాలుపాటించినట్లయితే ఎటువంటి ఆరోగ్య పరమైన ఇబ్బందులు లేకుండా జీవితం కొనసాగించవచ్చు అని తెలియచేసారు. హెచ్.ఐ.వి. ఉందనే కారణంతో వివక్ష చూపకూడదు అని, అది హెచ్.ఐ.వి..ఎయిడ్స్ చట్టం 2017 ప్రకారం శిక్షార్హమైన నేరమని తెలియచేసారు. హెచ్.ఐ.వి. పట్ల ఎటువంటి సందేహాలు/అనుమానాలు ఉన్నా జాతీయ హెల్ప్ లైన్ 1097 కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చునితెలియచేసారు. కండోమ్ బాక్సు ఇబ్బందులు గురించి చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమం ఉమ్మడి కర్నూల్ జిల్లాలో గ్రామాల్లో అవగహన సదస్సులు మరియు సేవలు అందించడం జరుగుతుంది. ముఖ్యముగా యువత, మహిళలు, పొదుపు సంఘాలు, కార్మికులు , గ్రామప్రజలనుభాగస్వాములు చెయ్యాలి అని చేప్పడం జరిగింది, ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ ఎన్ని కృష్ణవేణి అంగన్వాడి టీచర్స్ ఎస్ షాబీర, సుహాసిని ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ మఠంలో నాగుల చవితి వేడుకలు

**మంత్రాలయం ఆగస్టు,17,పల్లెసాక్షి** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో నాగుల చవితి వేడుకలను మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థుల అధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. నాగ పంచామిని పురస్కరించుకొని మఠంలో ఉన్న నాగప్ప విగ్రహాలకు పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ప్రత్యేక అభిషేకాలతో పూజలు చేసి మంగళ హారతి ఇచ్చారు. అంతకు ముందు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేసి హారతి ఇచ్చారు. సంస్థాన పూజల్లో భాగంగా మూల రామ దేవతలకు పూజలు చేసి ధూప దీప నైవేద్యాలతో అభిషేకాలు చేశారు. ఈ ఉత్సవాన్ని



తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని , రాఘవేంద్ర స్వామి మూల బృందావనని దర్శించుకున్నారు . భక్తులకు మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

# దాగిన వాస్తవాలకు వెలుగే 'కలం'

### సమాజ మార్పులో పాత్రికేయుల పాత్ర కీలకం ...ప్రజాస్వామ్యానికి పాత్రికేయులు వెన్నెముక

### పాత్రికేయుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం....నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు

### ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కర్నూలు, ఆగస్టు 17,పల్లెసాక్షి** సమాజంలో ప్రజా సమస్యలు, లోపాలు, దాగిన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని నగరపాలక కమిషనర్



చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం వెంకటరమణ కాలనీలోని కీర్తన అనాథశ్రణాలయంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ నిర్వహించిన 70వ ఆవిర్భావ దినోత్సవానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఏపీయూడబ్ల్యూజే జెండాను సీనియర్ పాత్రికేయులు, ఎన్టీవీ స్టాఫ్ రిపోర్టర్ జీ చంద్ర శేఖర్ ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయులు వెన్నెముక లాంటి వారని, నిష్పక్షపాతంగా వాస్తవాలను ప్రజల ముందుకు



తీసుకురావడం ద్వారా సమాజంలో చైతన్యం, మార్పుకు దోహదపడుతున్నారని కమిషనర్ అన్నారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ పరిధిలో ఉన్నవి తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి నగరపాలక సంస్థ తరఫున సాధ్యమైనంత వరకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అనాథ శరణాలయం చిన్నారులతో కలసి కేక్ కట్ చేసి, చిన్నారులకు తినిపించారు. అలాగే పిల్లలకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు ఈ. ఎన్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోరంట్ల కొండప్ప, సీనియర్ జర్నలిస్ట్ జి.చంద్ర శేఖర్, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు,



ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివ రాజ్ కుమార్, అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, మస్తాన్, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర రావు, మల్లికార్జున ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, సీనియర్ నాయకులు భాస్కర్, శ్రీనాథ్ రెడ్డి, సాగర్, రమేష్ రెడ్డి, సుధాకర్, పరమేష్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫీ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

APTEL 2022 / 16169
టుడే పల్లె సాక్షి
కర్నూలు నంద్యాల

# దరఖాస్తుల ఆహ్వానం

**ఉయ్యాలవాడ, ఆగస్టు 17:( టుడే పల్లె సాక్షి)** మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ వీర ప్రతాప్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ 6, స్కూల్ అసిస్టెంట్ హిందీ రెండు, ఇంగ్లీష్, సోషల్ ఒక్కొక్క పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 21వ తేదీలోగా ఉయ్యాలవాడ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలన్నారు. స్థానికంగా ఉన్నవారు, టెట్ లో ఉత్తీర్ణత సాధించిన వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు.

## పాఠశాలల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**బెల్లంకొండ ఆగస్టు 17,పల్లె సాక్షి,** మండలంలోని పాఠశాలల్లో మూడు అకాడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ ఇంచార్జ్ అధికారి ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం పోస్టులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మాచయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.ఏ(హిందీ) ఒకటి,రామాంజనేయ పురం పాఠశాలలో ఎస్.జి.టి రెండు పోస్టులు ఉన్నట్టు తెలిపారు. ఎంపికైన వారు ఎనిమిది నెలలపాటు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎస్జిటి కి నెలకు రూ. 12 వేలు సెకండ్ గ్రేడ్ టీచర్ కు రూ. 10 వేల గౌరవ వేతనం చెల్లిస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 16 నుంచి 21వ తేదీ.లోగా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. గడువు అనంతరం దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## అసెంబ్లీలో తేల్చుకోండి..
# గల్లీ రాజకీయాలు మానుకోండి

**డీఎస్సీతో వచ్చిన ఉద్యోగాలపై రాజకీయాలు చేయడం సరికాదు**

**పెద్దకడుబూరు మండల టీడీపీ అధ్యక్షుడు గవిగట్టు మల్లికార్జున**

**పెద్దకడబూరు ఆగష్టు 17 (పల్లెసాక్షి):** వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఆయన పార్టీ ఎమ్మెల్యేలు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై



నిర్మాణాత్మకంగా చర్చించాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ మెగా డీఎస్సీ--2025తో పాటు రాష్ట్ర ప్రజలకు సంబంధించిన ఏ అంశంపైనైనా మీకు అనుమానాలు, అభ్యంతరాలు ఉంటే వాటిని అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నించి,సమాధానాలు రాబట్టుకోవాలని కోరుతున్నాను. 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజా సమస్యలను ప్రశ్నించే వేదికగా అసెంబ్లీ ఉంది. ఆ వేదికను వినియోగించకుండా బయట ప్రాంతాల్లో కూర్చొని విమర్శలు చేయడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. "అసెంబ్లీకి రండి.. కూర్చొని చర్చిద్దాం" అని మంత్రి నారా లోకేష్ చెబుతున్న నేపథ్యంలో,ఇకనైనా అసెంబ్లీకి వచ్చి వాస్తవాలను ప్రజల ముందే చర్చించాలని కోరుతున్నాను. ముఖ్యంగా మెగా డీఎస్సీ--2025 ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా రాజకీయ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి. ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగం కోసం ఎదురుచూసిన నిరుద్యోగులకు ఉపాధ్యాయ ఉద్యోగం లభించడం ఒక గౌరవప్రదమైన విషయం. వారి విజయాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరైన విధానం కాదు. డీఎస్సీపై ఏమైనా సందేహాలు ఉంటే పత్రాలు, గణాంకాలతో అసెంబ్లీలో ప్రశ్నించండి. ప్రభుత్వం ఇచ్చే సమాధానాలను ప్రజల సమక్షంలోనే చర్చించండి. అసెంబ్లీలో ప్రశ్నించకుండా గల్లీల్లో రాజకీయ విమర్శలు చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదు. ప్రజలు ఇప్పుడు మాటలను మాత్రమే కాదు.. ఎవరు సమస్యను ఎక్కడ ప్రశ్నిస్తున్నారు? ఎవరు పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు? అన్నదాన్ని కూడా గమనిస్తున్నారు. అందుకే జగన్ వైసీపీ ఎమ్మెల్యేలకు నా విజ్ఞప్తి ఒక్కటే---"బయట రాజకీయ రచ్చ కాదు.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ కావాలి. గల్లీ మాటలు కాదు..అసెంబ్లీ వేదికగా వాస్తవాలపై సమాధానాలు కావాలి."ప్రజా సమస్యలపై చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. మీరు కూడా అసెంబ్లీకి వచ్చి చర్చించండని వారు తెలియజేశారు.

## యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దర్శించుకుని,
# వివాహ వేడుకలో పాల్గొన్న కాటసాని దంపతులు

**బనగానపల్లె ఆగష్టు 17 పల్లె సాక్షి** బనగానపల్లె మండలంలోని ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం యాగంటి శ్రీఉమామహేశ్వర స్వామివారిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా





అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే శ్రీ కాటసాని రామభూపాల్ రెడ్డి ఆయన సతీమణి శ్రీమతి కాటసాని ఉమామహేశ్వరమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగంటి శ్రీఉమామహేశ్వర నిత్యాన్న సత్రం (కళ్యాణ మండపం)లో యాగంటి ప్రధాన అర్చకులు శ్రీ మహేశ్వర శర్మ కుమార్తె జయకృష్ణ దీప్తి ప్రవీణ్ కుమార్ శర్మ కుమారుడు, అర్చకులు మంజునాథ శర్మ వివాహ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు

# ఏపీయుడబ్ల్యూజే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

**ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ పెద్దకడబూరు మండల కమిటీ**

**ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యులు జెబి.భీమన్న, ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ అధ్యక్షుడు సోమన్న**

**ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ ప్రధాన కార్యదర్శి రామన్న, ఏపీయూడబ్ల్యూజే తాలూకా ఉపాధ్యక్షులు జె.పుల్లయ్య**

**తహసిల్దార్ వలిబాషకు వినతి పత్రం అందించిన పెద్దకడబూరు మండల కమిటీ**

**పెద్దకడబూరు ఆగష్టు 17 (పల్లెసాక్షి):** మండల శాఖ 2026 ఆగస్ట్ 17 వ తేదీన ఏపీయూడబ్ల్యూజే ప్లాటినం జూబిలీ ఉత్సవాలు ( 70 వ వార్షికోత్సవ వేడుకలు) ప్రారంభం అవుతున్న సందర్భంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ మండల కేంద్రమైన పెద్దకడబూరులోనే ఏపీయు డబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యులు జె.భీమన్న, ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ సభ్యులు బోగ్గుల సోమన్న,మండల ప్రధాన కార్యదర్శి మంచోది రామన్న,తాలూకా ఉపాధ్యక్షులు జే. పుల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని మండల తహసీల్దార్ వలిబాషాకు ప్రజా గ్రీవెన్స్ లో వినతి పత్రం అందజేశారు. అనంతరం మండల తహసీల్దార్ కు తెలియజేస్తూ రాష్ట్రంలో వర్కింగు జర్నలిస్టుల పెండింగు సమస్యలను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఏపీయూడబ్ల్యూజే 1957 ఆగస్ట్ 17 వ తేదీన ఆవిర్భవించింది. 2026 ఆగస్ట్ 17 వ తేదీ నాటికి యూనియన్ ఆవిర్భవించి 69 ఏళ్ళు పూర్తి చేసుకుని 70 వ ఏట ప్రవేశిస్తున్నది. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, వృత్తి ప్రమాణాల పెంపుదల, వర్కింగు జర్నలిస్టుల హక్కులు,జర్నలిస్టుల సంక్షేమం,జర్నలిస్టుల భద్రత గురించి గత 70 ఏళ్ళుగా ఏపీయూడబ్ల్యూజే ఎన్నో పోరాటాలు సాగించిన విషయం తమకు తెలిసినదే. ఉమ్మడి రాష్ట్రంలోనూ,విభజిత ఆంధ్రప్రదేశ్ లోనూ ప్రస్తుతం జర్నలిస్టులు అనుభవిస్తున్న సదుపాయాలన్నీ ఏపీయూడబ్ల్యూజే చొరవతో,కృషితో అమలులోకి వచ్చినవేనని ఈ సందర్భంగా సగర్వంగా గుర్తు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఎ.పి. యూనియన్ ఆఫ్ వర్కింగు జర్నలిస్ట్స్ 70 వ ఏట ప్రవేశించడం తెలుగు పత్రికా రంగ చరిత్రలో ఒక గర్వకారణమైన ఘట్టంగా మీ దృష్టికి తెస్తున్నామని 2026 ఆగస్ట్ 17 వ తేదీ నుండి ఏడాది



పొడవునా ప్లాటినం జూబిలీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి మా యూనియన్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందని అన్నారు. ప్లాటినం జూబిలీ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మాయూనియన్ పోరాట సంప్రదాయాన్ని అనుసరించి వర్కింగు జర్నలిస్టుల ఈదిగువ పెండింగు సమస్యలు పరిష్కారం చేయాలని తెలిపారు.

**ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టుల డిమాండ్స్...** వర్కింగు జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలి. రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ డబ్ల్యూ జె హెచ్ ఎస్ అమలులో నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎదురవు తున్న ఇబ్బందుల వల్ల పలువురు జర్నలిస్టులు ఆరోగ్య ప్రయోజనాలు పొందలేక పోతున్నారు. ప్రభుత్వం నుండి బకాయిలు ఉన్నాయన్న పేరుతో నెట్ వర్క్ ఆస్పత్రులలో డబ్ల్యూ జె హెచ్ ఎస్ కార్డును చాలా సందర్భాల్లో అనుమతించుట లేదు. కొన్ని ప్రాసెస్ లకు కూడా కార్డు వర్తించుట లేదు. ఇటువంటి లోటుపాట్లను సవరించి డబ్ల్యూ జె హెచ్ ఎస్ ను మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరుతున్నామని తెలిపారు. పథకం అమల్లో ఎదురవుతున్న రోజువారీ సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్,జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలనీ,తద్వారా జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని వివరించారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని కూటమి ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాము. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి కూడా రెండేళ్లు పూర్తయ్యింది. ఇప్పటివరకూ ఈ విషయమై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం మినహా ఒక్క అడుగు ముందుకు పడలేదు. 2018-19 లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకం ఆచరణలో అమలుకు నోచుకోలేదు. అందువల్ల మరింత జాప్యం లేకుండా ఇళ్ల స్థలాల విషయమై సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. జర్నలిస్టులు వృత్తి ద్వారా సమాజానికి చేసిన సేవలను, వారికి తగిన వేతనాలు గానీ, ఉద్యోగ విరమణ పింఛను గానీ లేని పరిస్థితులను,వారి వయసును దృష్టిలో ఉంచుకుని విశ్రాంత జీవితాన్ని గౌరవప్రదంగా గడపడానికి వీలుగా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రారంభించాలని కోరుతున్నామని జర్నలిస్టులపై పెరిగిపోతున్న భౌతిక దాడులు,బెదిరింపులు,దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రతకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే తాలూకా కమిటీ సభ్యులు సీనియర్ పాత్రికేయులు బొగ్గుల ఈరన్న, మండల కమిటీ సభ్యులు మంచోది ఏలియస్,మంచోది ఎం సి నారాయణ,శివ,మంచోది రాజు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఇన్ స్ట్రక్ట్ ర్ పోస్టులకు
# దరఖాస్తుల ఆహ్వానం

**మండల విద్యశాఖ అధికారి పి.జగదీష్**

**పెద్దకడబూరు ఆగస్టు 17,(పల్లెసాక్షి)** పెద్దకడబూరు మండలంలోని ప్రభుత్వం పాఠశాలలోని అకాడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు



ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి పి.జగదీష్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖ అధికారి తెలియజేస్తూ ప్రభుత్వం పాఠశాలలో ఖాళీ ఉన్న పోస్టులకు అభ్యర్థుల నుంచి ఎస్జిటి పోస్టులకు 11 దరఖాస్తులు,స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 09 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఈ నెల 20 వ తేదిలోపు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. గడువు అనంతరం దరఖాస్తులు పూర్తి వివరాలకు మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

**ఉయ్యాలవాడ, ఆగస్టు 17:( టుడే పల్లె సాక్షి)** ప్రజల నుండి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసిల్దార్ ప్రసాద్ బాబు తెలిపారు. సోమవారం స్థానిక



రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లూరు, రూపనగుడి, ఆర్.పాంపల్లె, తదితర గ్రామాల నుండి భూ సమస్యల పైన తహసిల్దార్ కు వినతి పత్రాలు అందజేశారు. మాయలూరు, అల్లూరు వివిధ గ్రామాల నుండి వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు, ఇంటి స్థలం ఇంటి నిర్మాణాల కోసం అనుమతులు మంజూరు చేయించాలని ఎంపీడీవో నాగలక్ష్మమ్మకు వినతి పత్రాలు అందజేశారు. క్షేత్రస్థాయిలో భూ సమస్యలను పరిశీలన చేసి బాధిత రైతులకు న్యాయం చేస్తామని తహసిల్దార్ వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటయ్య, నరసింహారావు, ఫణీత్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నగదు పురస్కారాలు

**ఉయ్యాలవాడ, ఆగస్టు 17:( టుడే పల్లె సాక్షి)** మండలంలోని మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు మాబు షరీఫ్ సోమవారం తెలిపారు. 2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 543 మార్కులు సాధించిన అచిత, 513 మార్కులు సాధించిన నాగమల్లిక, 472 మార్కులు సాధించిన రాజేశ్వరికి గోవిందపల్లె గ్రామానికి చెందిన చామల చంద్రశేఖర్ రెడ్డి రూ. 10 వేలు నగదు బహుమతులు



అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు అందజేయడం ద్వారా ఉత్సాహంతో విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మరింత ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## 101 బిందెలతో కాశీ విశ్వేశ్వరునికి
# జలాభిషేకం

**ఉయ్యాలవాడ, ఆగస్టు 17:( టుడే పల్లె సాక్షి)** మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో సోమవారం కాశీ విశ్వేశ్వరుడికి 101 బిందెలతో జలాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన అంబటి శివ, వెంకటేష్, నందికేశవలతోపాటు మరికొందరు పెళ్లి కాని యువకులు గ్రామంలోని చేతిబోరు వద్ద పుణ్య స్నానాలు చేసి నీటి బిందెలతో ఆలయానికి చేరుకుని స్వామివారికి అభిషేకం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచిన ఇంతవరకు సరైన వర్షాలు కురవలేదన్నారు. వర్షాలు కురవకపోతే పంటలు సాగు చేసుకునేందుకు వీలు కాదన్నారు. ఈ ఏడాది పూర్తి కరువు చాయలు కనిపిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేవునిపై భారం వేసి స్వామివారికి అభిషేకం చేసినట్లు వారు వెల్లడించారు.





# మా దళితుల భూమి మాకు చూపించండి

**పి జి ఆర్ ఎస్ లో తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసిన బసలదొడ్డి గ్రామ దళితులు**

**పెద్దకడబూరు ఆగస్టు 17 (పల్లెసాక్షి):** పెద్దకడబూరు మండలంలోని బసలదొడ్డి గ్రామంలో సర్వే నంబర్ 89,4.19 ఎకరంలలో దళితుల ఇల్లు స్థలాన్ని 2.56 ఎకరంలలో రెండుచోట్ల మాజీ విఆర్ఓ లంకారెడ్డి ఆక్రమించారని అలాగే మరో చోట మాజీ జెడ్పిటిసి మరియు వైసీపీ నాయకుడైన పి బాల రంగస్వామి దౌర్జన్యంగా గత ప్రభుత్వంలో పార్టీ అండ చూసుకొని ఇంటి నిర్మించారని వెంటనే వారిపై చర్యలు తీసుకొని మాకు రావలసినటువంటి ఇల్లు స్థలాలు



ఇవ్వవలసిందిగా మండల తాసిల్దార్ కు తెలియజేశారు. గ్రామంలో సర్వే నంబర్ 89లో ఒకటి. 63 ఎకరంలో మాకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీ. ఆదాము, బి. ఈరన్న,ఎం.ప్రకాష్ ఎం. అంతోని సీటీ ఆంజనేయ, ఎం. మరియదాసు, శేఖర్,ఎం. చంద్రశేఖర్, ఆర్. నరస య్య, యోహాను,వై. రామాంజనే యులు, వై.రాజ్ కుమార్,పెద్ద మారెప్ప, దేవదాసు, తాయన్న,యోబు దేవదాసు, తిరుమల, మారయ్య, ఈరన్న,బాబు, ఏసేపు,ప్రకాష్ రాయప్ప, మూర్తి, రవితేజ, ప్రాన్సిస్,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

EDITED&PUBLISHED AND OWNED BY EDITOR:V.LINGAMURTHY. PUBLISHED AT DOOR NO:4/83,BC COLONY, KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, PINCODE:518360.MURTHY OFFSET PRINTERS D.NO:4/83,KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, CONTACT NO:9000367833.RNI,APTEL/2022/82037 E-MAIL ID:pallesakshi2022@gmail.com